

ఉష్ణోగ్రత
గరిష్ఠం 42.6
కనిష్ఠం 17.9

దళారులను ఆశ్రయించొద్దు

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలి

డీపీఎంలు విలాస్‌రావు, నరసింహ

8



ఆయన విద్యాభ్యాసమంతా ఇంగ్లిష్ మీడియంలోనే సాగింది. ఉపాధ్యాయ వృత్తిలోనూ ఆంగ్లం పాఠాలనే బోధిస్తున్నాడు. కానీ ఆయనకు తెలుగు భాషపై ఉన్న మక్కువతో సాహిత్యంలో మెరిసిపోతున్నాడు. ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేస్తూనే రంగుల ప్రపంచం(సినిమా రంగం)లోకి అడుగు పెట్టి హౌరా అనిపించుకుంటున్నాడు ఉపాధ్యాయుడు ద్యావరి నరేందర్‌రెడ్డి.

నగా దారిలో..

- మొదటి సినిమా పాటతోనే మంచి గుర్తింపు
- ఆకట్టుకున్న 'విరాటపర్వం' లోని నగా దారిలో పాట
- ఇంగ్లిష్ టీచర్ అయినా తెలుగుపై అమితమైన ప్రేమ
- అనేక పద్యాలు, పాటలు, గజల్స్ రచన
- ఉపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి ప్రతిభపై ప్రత్యేక కథనం

పెద్దేముల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా పెద్దేముల్ గ్రామంలోని నారాయణమ్మ, చిన్నరాంరెడ్డి దంపతుల కుమారుడు ద్యావరి నరేందర్‌రెడ్డి. వారిది రైతు కుటుంబం. నరేందర్ రెడ్డి పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన వృత్తి రీత్యా విద్యార్థులకు

మిగతా 7వ పేజీలో...

Sunday Special



హీరో రాణా, హీరోయిన్ సాయిపల్లవితో నరేందర్‌రెడ్డి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రహదారులు కంకర తేలి, గుంతలు పడి దారుణంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల రోడ్లపై వాహనాలను నడపాలంటేనే బెంబేలెత్తుతున్నారు. ఛిద్రమైన దారుల్లో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ధ్వంసమైన రోడ్లపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పదేళ్ల క్రితం వేసిన రోడ్లన్నీ ప్రస్తుతం అడుగుకో గుంత.. గజానికో గొయ్యిలా మారాయి. పాడైన వాటికి మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణాలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. అస్తవ్యస్తంగా ఉన్న దారులపై ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో 500 కిలోమీటర్ల మేర రోడ్లకు తక్షణ మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.



జిల్లేడు చౌదరిగూడ- తుంపల్లి రోడ్డు దుస్థితి

రహదారుణం!



షాబాద్ : అధ్వానంగా చందన్‌వెల్లి, శంషాబాద్ రోడ్డు

- ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా రోడ్లు
- పాడైన ఆర్‌అండ్‌బీ, పంచాయతీ దారులు
- నరకం చూస్తున్న వాహనదారులు
- తరచూ ప్రమాదాలతో బెంబేలు
- మరమ్మతులు ప్రతిపాదనలకే పరిమితం
- చేసిన పనులకూ అందని బిల్లులు
- ముందుకు రాని కాంట్రాక్టర్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

అడుగుకో గుంత.. గజానికో గొయ్యి

రంగారెడ్డి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 934 కిలో మీటర్ల మేర ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రోడ్లు దెబ్బతిన్నాయి. తక్షణ మరమ్మతులు చేపట్టాల్సినవి 500 కిలో మీటర్లు ఉన్నాయి. రోడ్ల మరమ్మతుకు కొన్ని ప్రాంతాల్లో నిధులు మంజూరైనప్పటికీ బిల్లులు పెండింగ్ ఉండటంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతో రోడ్ల మరమ్మతులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. రంగారెడ్డి జిల్లాలో 113కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లు దెబ్బతిన్నాయి. ఇందులో 15రోడ్లు తక్షణం మరమ్మతులు చేయాల్సి ఉంది. కానీ, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆయా నియోజకవర్గ ప్రజలు ఆరోపిస్తున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో 41 కిలోమీటర్ల మేర రోడ్లు పాడవగా, వీటి మరమ్మతుల కోసం రూ.220 కోట్లు ప్రతిపాదనలు పంపించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పంపించిన ప్రతిపాదనలకు నేటికీ మోక్షం కలగడం లేదు. నిధుల మంజూరు కోసం ఎదురుచూపులు

మిగతా 7వ పేజీలో...

జిల్లాలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగలు ఎండ దంచి కొట్టగా.. సాయంత్రం ఈదురు గాలుల వర్షం కురిసింది. రెండు మూడు రోజులుగా క్లైమెట్ ఇలాగే ఉంటుంది. శనివారం భానుగు భగ్గు మన్నాడు. నిప్పుల కొలిమిని తలపించింది. శంకర్‌పల్లి మండలం పొద్దుటూరులో అత్యధికంగా 42.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆమనగల్లులో సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఇక్కడ అత్యధి కంగా 27.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉదయం వేళ భానుడి భగ భగలకు జనం ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు భయపడ్డారు. ఈ ఏడాదిలో వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రత శనివారం నమోదైంది. ఎండ వేడిమికి జనం ఉక్క పోతతో ఉక్కిరి బిక్కిరయ్యారు. మధ్యాహ్నం రహదారులన్నీ నిర్మాను ష్యంగా మారాయి. సాయంత్రం 4 గంటల తర్వాత ఉన్నట్టుండి వాతావరణంలో మార్పులు చోటు చేసుకు న్నాయి. ఉరు ములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులతో చేతి కొచ్చిన వరి పంట నేల కొరిగింది. కొను గోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి ముద్ద య్యింది. అకాల వర్షంతో రైతులు అతలాకుతల మయ్యారు. వర్షం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు.

రంగారెడ్డి అర్బన్/ ఆమనగల్లు, మే 3 (ఆంధ్రజ్యోతి)



ఆమనగల్లు మార్కెట్‌లో తడిసిన ధాన్యం

పగలు ఎండ.. సాయంత్రం వాన

7

- పొద్దుటూరులో అత్యధిక ఉష్ణోగ్రత 42.6 డిగ్రీలు నమోదు
- ఆమనగల్లులో దంచి కొట్టిన వాన, 27.5 మి.మీ. వర్షపాతం
- మార్కెట్ యార్డులో వర్షానికి కొట్టుకుపోయిన వరి ధాన్యం
- కడ్తాల మండలంలో 82 ఎకరాలలో వరి, 10 ఎకరాలలో మామిడి పంటల నష్టం
- పలు చోట్ల కూలిపోయిన చెట్లు... నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- వడగండ్ల తాకిడికి పెద్దఎత్తున రాలిపోయిన వడ్లు

జిల్లాలో భిన్న వాతావరణం



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన చేవెళ్ల చౌరస్తా

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆదిభట్ల, మే 3(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధి ఆదిభట్లలోని టీసీఎస్ ఎదురుగా, బొంగ్లూర్, మంగల్‌పల్లి, ఎంపీ పటేల్‌గూడలో అనుమతులు లేకుండా షెడ్లు, భవన నిర్మాణాలు జరుగుతున్నట్లు కమిషనర్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు శనివారం టీసీఎస్ ఎదురుగా అక్రమంగా చేపట్టిన 10 నిర్మాణాలను సిబ్బందితో కూల్చివేయించారు. కమిషనర్ మాట్లాడుతూ కొందరు అనుమతులు, సెట్‌బ్యాక్ లేకుండా తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ అంతస్తులు, జీ-ప్లస్2 అనుమతులు తీసుకొని అధిక ఫ్లోర్ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. దాంతో స్థానిక ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నామని తెలిపారు.

నీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ నారాయణరెడ్డి



రంగారెడ్డి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : నీట్ పరీక్షలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. నీట్ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులతో శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నేడు (ఆదివారం) నిర్వహించే నీట్ పరీక్షకు జిల్లాలో 19 కేంద్రాలను గుర్తించడం జరిగిందని, 6,964 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. నీట్ పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు 144 సెక్షన్ విధించనున్నట్లు తెలిపారు. పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి అడ్మిట్ కార్డు, పాస్‌ఫొటో మినహా ఎలాంటి వస్తువులు తీసుకురావద్దని సూచించారు. ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద మెడికల్ సిబ్బందిని నియమించి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.

రేపటి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అన్నదాతలకు అవగాహన



జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

రంగారెడ్డి అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మే 5వ తేదీ నుంచి జూన్ 13వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా గుర్తించిన గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి బి.నర్సింహారావు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ప్రధానంగా యూరియా వాడకం, సాగు ఖర్చును తగ్గించడం, భూసారం కాపాడటం, విత్తన, పురుగు మందుల కొనుగోలు, రసీదులు భద్రపరచడం, కష్ట కాలంలో నష్టపరిహారాన్ని పొందడం, సాగు నీటి ఆదా, పంటమార్పి పద్ధతులు, సుస్థిర ఆదాయం, చెట్ల పెంపకం-పర్యావరణ పరిరక్షణ తదితర వాటిపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

కొత్తూర్ : కొత్తూర్ మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలోని రైతు వేదికలో 5వ తేదీన 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు. ఉదయం 8 గంటలకు రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు హాజరుకానున్నట్లు తెలిపారు.

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ మండల పరిధిలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేతలు' నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్వేత తెలిపారు. 5న కోత్వాల గూడ, 6న హమీదుల్లానగర్, 12న పోశెటిగూడ, 13న కవేలిగూడ, 19న నర్ఖూడ, 20న రశీద్గుడ, 26న రామానుజాపూర్, 27న చిన్నగోల్కొండ, జూన్ 3న సంగీగూడ, 4న కాచారం, 9న రాయన్నగూడ, 10న శంకరాపూర్ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కేంద్రం విధానాలతో ప్రమాదం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

8



ఆరేళ్లుగా అద్దె చెల్లించడం లేదని..

- ఎంపీడీవో కార్యాలయం గేట్‌కు తాళం
- ఆరుబయటే అధికారుల పడిగాపులు
- ఎంపీడీవో హామీతో తాళం తీసిన భవన యజమాని

చౌదరిగూడ, మే 3(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా అద్దె చెల్లించడం లేదని ప్రభుత్వ కార్యాలయానికి తాళం వేసిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గత ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం 2016లో జిల్లేడ్ చౌదరిగూడను నూతన మండలంగా ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయాన్ని ఓ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఆరేళ్ల గడిచినా అద్దె చెల్లించడం లేదని శనివారం ఉదయం భవన యజమాని శ్రీనివాస్ మండల పరిషత్ కార్యాలయం గేటుకు తాళం వేశాడు. అధికారులను లోపలికి వెళ్లనీయకుండా బయటే నిలిచి ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్‌కుమార్ అక్కడికి చేరుకొని ఇంటి యజమానితో మాట్లాడి కార్యాలయం తాళం తీయించారు. ప్రస్తుతం రెండు నెలల అద్దె ఇచ్చి, మిగితావి చెల్లించేందుకు ఉన్నతాధికారులకు విన్నవించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.



చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయం గేట్‌కు వేసిన తాళం

తాండూరులో దోస్త్ సహాయ కేంద్రం

తాండూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్ తెలంగాణ(దోస్త్) జిల్లా స్థాయి సహాయ కేంద్రాన్ని శనివారం తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించారు. హైదరాబాద్ రోడ్డులోని డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. లక్ష్మణ్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలు పొందే విద్యార్థులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కేంద్రం ద్వారా అడ్మిషన్ ప్రక్రియ సులువుగా ఉంటుందని, పేర్ల నమోదు, ఆధార్, ధ్రువీకరణ, వెబ్ ఆప్షన్ నమోదు తదితర సేవలను ఈ కేంద్రం ద్వారా పొందొచ్చని తెలిపారు. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సింగిల్ విండో ద్వారా విద్యార్థులు సేవలను పొందొచ్చన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. కళాశాల దోస్త్ సమన్వయకర్తగా ఎస్.మహేందర్‌రెడ్డి వ్యవహరిస్తారని చెప్పా రు. టెక్నికల్ కోఆర్డినేటర్లుగా సీహెచ్.కిషన్, ఆర్.అమర్‌ల ను నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు షరీఫా, అమర్, హరికృష్ణ, రవి, ఆశప్ప, అనంతరామ్ పాల్గొన్నారు.

వాట్సాప్ నంబర్: దోస్త్‌లో కొత్త సదుపాయలు కల్పించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు వాట్సాప్ నంబర్ 7901002200 ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునని, గూగుల్ ప్లేస్టోర్ నుంచి దోస్త్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. మొబైల్ నంబర్లు 9885583432(మహేందర్‌రెడ్డి), 9959531273(కిషన్), 9849432029(అమర్)లలో సంప్రదించొచ్చని చెప్పారు.



జిల్లా స్థాయి దోస్త్ సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్

లైబ్రరీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

చేవెళ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో నిర్మిస్తున్న గ్రేడ్1 లైబ్రరీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం నిర్మాణంలో ఉన్న లైబ్రరీ పనులను ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలో అన్ని హంగులతో రూ.2కోట్లతో గ్రేడ్‌వన్ లైబ్రరీ నిర్మించడం జరుగుతుందన్నారు. పనుల విషయంలో నాణ్యత ప్రణాలు పాటించాలన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. గ్రేడ్‌వన్ లైబ్రరీ చేవెళ్ల ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముడిమ్యాల్ పీఏసీఎస్ ఛైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్, సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి, మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి, నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.



లైబ్రరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ

కందుకూరు, మే 3(ఆంధ్రజ్యోతి): ఓటర్ నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటుహక్కు ఉండొద్దని, త్వరలో బీఎల్‌వోలతో ఓటర్ లిస్టుల పరిశీలన చేపడుతామని ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాల యంలో రాజీకాయ పార్టీ నాయకులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ కేంద్రానికి 3కిలోమీటర్ల దూరంలో 20మందికి పైగా ఉంటే వారికి కొత్తగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలో ఓటర్ నమోదుకు ఆధార్ ఫీడింగ్ ప్రక్రియ రానుందని తెలిపారు. మరణించిన వారి డెత్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో పొందుపర్చి వారి పేర్లను తొలగిస్తామని చెప్పారు. ఎక్కడా ఓటరు లిస్టులో పేరులేని వయోజనులు ఓటుహక్కు కోసం తగిన ప్రూఫ్స్‌పెట్టి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పేర్లు లేని వారి నమోదులో రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎన్నికల డీటీ తాజుద్దీన్, ఇన్‌చార్జి తహహసీల్దార్ శేఖర్, బాలాపూర్, మహేశ్వరం, సరూర్‌నగర్ తహహసీల్దార్లు ఇందిరాదేవి, సైదులు, రాజు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జయేందర్, బుట్టి బాల్‌రాజ్, అఫ్జల్‌బేగ్, ప్రశాంత్, జి.యాదయ్య, కంద పెద్దనర్సింహ, అమరేందర్, ఆర్ఐలు ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి

యువత చేతుల్లో దేశ భవిష్యత్తు

ఘట్‌కేసర్, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) మండల కార్యదర్శి సంపంగి సదాశివ అన్నారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పోచారం మున్సిపాలిటీ ఆర్జీకే కాలనీలో సమాఖ్య జండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం యువత నిరంతర ఉద్యమాలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, అనంద్, సోమన్న, చిరంజీవి, పాండు, నాగరాజు, శ్యామ్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పగలు ఎండ సాయంత్రం వాన!



ఆమనగల్లు యార్డులో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు

అకాల వర్షంతో తీవ్ర పంటనష్టం

ఆమనగల్లు, మే3(ఆంధ్రజ్యోతి): పగలు ఎండ తీవ్రత, సాయంత్రం వేళ వర్షంతో శనివారం భిన్న వాతావరణం ఏర్పడింది. సాయంత్రం వరకు భానుగు భగ్గుమన్నాడు. సాయంత్రం 4గంటల తర్వాత ఉన్నట్టుండి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఆమనగల్లులో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరి ధాన్యం కొట్టుకుపోయింది. మార్కెట్ యార్డ్‌లో ఎండబోసినవడ్లు వరదకు హైదరాబాద్-శ్రీశైలం రహదారిపైకి చేరాయి. వడ్లను కాపాడుకోవడానికి రైతులు, మహిళలు ధాన్యాన్ని కుప్ప పోశారు. వారం పది రోజులుగా మార్కెట్‌లోని సీసీపై వడ్లు ఎండబోస్తున్నారు. ఉదయం సుమారు 800బస్తాల ధాన్యం తూకం వేసి మిల్లుకు తరలించడానికి మార్కెట్ ఆవరణలో ఉంచారు. ఒక్కసారిగా వచ్చిన వర్షంతో ఎండబోసిన ధాన్యం తడిసింది. మార్కెట్ యార్డ్ నీటి కుంటను తలపించింది. వేలాది బస్తాల ధాన్యం తడిసింది. సుమారు 100మంది రైతుల ధాన్యం తడిసింది.

ఈదురు గాలులతో వర్షం



కొనాయలపల్లి వద్ద రోడ్డుపై విరిగిన పడిన చెట్లు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట, కోనాయపల్లి గ్రామ మధ్య శనివారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం పడింది. కొత్తపేట-కోనాయపల్లి రోడ్డులో అక్కడక్కడ చెట్లు విరిగిపడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులేర్పడ్డాయి. మామిడికాయలు రాలాయి. కొత్తపేట, సంతాపూర్, చౌలపల్లి, మీనామోనిపల్లి గ్రామాల్లోనూ వర్షం పడింది.

పిడుగుపడి గేదె మృతి



కందుకూరు: మండలంలోని గాజులబురుజు తండాలో శనివారం సాయంత్రం పిడుగుపడి ఓ గేదె మృ తిచెందింది. బేగంపేటకు చెందిన రాజు తన గేదెను పొలం వద్ద దొడ్డిలో కట్టేశాడు. ఉరుములు, మెరుపులతో పిడుగు పడి గేదె చనిపోయింది.

● వడగండ్లకు రాలిన వడ్లు, మామిడి

కడ్తాల్: అకాల వడగళ్ల వర్షం, ఈదురు గాలులు అన్నదాలతలకు తీవ్ర నష్టం కలిగించింది. కడ్తాల మండలం ఎక్వాయిపల్లి, మర్రిపల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి వడగండ్ల వర్షానికి కోతకొచ్చిన వరిచేలలో వడ్లు, తోటల్లో మామిడి కాయలు నేలరాలాయి. అరగంట పాటు వడగండ్ల వాన కురిసింది. వైర్లు తెగి చాలాచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎక్వాయిపల్లి, మర్రిపల్లి గ్రామాల్లో 60 మంది రైతులకు చెందిన 82ఎకరాల వరి పంట, పదెకరాల్లో మామిడి పంటలు దెబ్బతిన్నా యి. రైతులు జోగు వీరయ్య, సుమన్, మల్లేశ్, బిక్షపతి, రాఘవరెడ్డి, మహేశ్, చంద్రయ్య, శ్రీశైలం, కొమురయ్య, బాలయ్య, జంగయ్యల వరిపంటకు భారీ నష్టం వాటిల్లింది. నేలరాలిన పంటను శనివారం ఏవో శ్రీలత పరిశీలించారు. ఏఈవోలు అభినవ్‌రెడ్డి, కష్యత్‌లతో పంట నష్టం వివరాలను నమోదు చేశారు.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం..

వడగండ్ల వానతో పంటలు కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పంట నష్టంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వివరిస్తానని చెప్పారు. ఎక్వాయిపల్లి, మర్రిపల్లిల్లో పంటలను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ప్రభు త్వం నుంచి నష్టపరిహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మె ల్యే వెంట మార్కెట్ కమిటీ ఛైర్మన్ యాట గీత నర్సింహ, వైస్‌ఛైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యు డు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉమవతి, ప్యాక్స్ డైరెక్టర్ జె.వీరయ్య, నాయకులు పి.కరుణాకర్ గౌడ్, సుమన్, మల్లేశ్, శంకర్, బిచ్యానాయక్, బిక్య, శేఖర్‌గౌడ్, రవి, ఇమ్రాన్‌బాబ, రైతులు ఉన్నారు.

ఎకరాకు రూ.40వేల పరిహారమివ్వాలి

వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఎక్వాయిపల్లి, మర్రిపల్లి, ముద్విన్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను నాయకులతో కలిసి పరిశీలించారు. మండలంలో 200 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని తెలిపారు. అధికారులు వెంటనే గ్రామాల్లో పంటనష్ట వివరాలను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. రైతులకు ఎకరాకు రూ.40వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జోగు వీరయ్య, నర్సింహాగౌడ్, బిక్షపతి, నర్సిం హ, యాదయ్య, బాలయ్య, కృష్ణయ్య, జంగయ్య, సురే శ్ ఉన్నారు. అలాగే పంటలను డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, గంప శ్రీను పరిశీలించారు.



కడ్తాల్: ఎక్వాయిపల్లిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

రాలిన మామిడి

యాచారం: మండలంలోని నజ్దిక్‌సింగారం, కుర్మిద్ద, యాచారం, నజ్దిక్‌సింగారం తదితర గ్రామాల్లో వడగండ్ల వర్షంతో వడ్లు, మామిడికాయలు రాలాయి. అధికారులు పొలాలను పరిశీలించి తమకు తగిన పరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నమోదైన ఉష్ణోగ్రతలు(సెల్సియస్)

మండలం	ప్రాంతం	నమోదు
శంకర్‌పల్లి	పొద్దుటూరు	42.6
మొయినాబాద్	మొయినాబాద్	42.4
మొయినాబాద్	రెడ్డిపల్లి	41.7
మహేశ్వరం	మహేశ్వరం	41.6
హయత్‌నగర్	వనస్థలిపురం	41.5

వర్షపాత వివరాలు(మిల్లీ మీటర్లలో..)

మండలం	ప్రాంతం	నమోదు
ఆమనగల్లు	ఆమనగల్లు	27.5
తలకొండపల్లి	వెల్జాల్	16.0
కందుకూరు	రాచులూర్	11.8
తలకొండపల్లి	చుక్కాపూర్	11.5
అబ్దుల్లాపూర్‌మెట్	పసుమాముల	11.5



ఎక్వాయిపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

పంటను పరిశీలించిన అధికారులు

కందుకూరు: వనగండ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలను శనివారం ఏఈవో నర్మద లేమూరులో పరిశీలించారు. శుక్రవారం రాత్రి లేమూరు, గూడూరు, రాచులూరుల్లో వనగండ్ల వాన కురిసింది. లేమూరులో వరి పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. ఏఈవో, కాంగ్రెస్ నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, శ్రీధర్ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు కేశవరెడ్డి, రహీం, మధుసూదన్‌రెడ్డి, ఎం.మైసయ్య, యాదవరెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, రవి, నాయకులు విఠల్‌రెడ్డి, ఎం.రవి, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు. శనివారం సాయంత్రం కం దుకూరు, కొత్తగూడ, నేదునూరు, దెబ్బడగూడ, గూడూరు, దాసర్లపల్లి గ్రామాల్లో వర్షం కురిసింది.



కుర్మిద్దలో వడగండ్లతో రాలిన వడ్లు



కందుకూరు: లేమూరులో వరి పంటను పరిశీలిస్తున్న ఏఈవో నర్మద, కాంగ్రెస్ నాయకులు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

● హైదరాబాద్-శ్రీశైలం హైవేపై రైతుల రాస్తారోకో



మార్కెట్ యార్డ్ ఎదుట బైఠాయించిన రైతులు

ఆమనగల్లు, మే 3(ఆంధ్రజ్యోతి):ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శనివారం వర్షానికి వడ్లు తడిసిపోవడంతో రైతులు ఆగ్రహించారు. కొనుగోళ్లలో జాప్యంవల్లే ధాన్యం తడిశాయని ఆవేదనతో మార్కెట్ యార్డ్ వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపైకి రాస్తారోకో చేశారు. గంట పాటు వాహనాలు నిలిచాయి. తమకు న్యాయం చేయాలని రైతులు భీష్మించారు. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. తడిసిన వడ్లను ప్రభుత్వం కొనాలని, కలెక్టర్ వచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెడుతోందని ఆరోపించారు. సమాచారం అందుకున్న సీఐ జానకిరాంరెడ్డి, సిబ్బందితో యార్డ్ వద్దకు చేరుకొని రైతులకు, బీఆర్ఎస్ నాయకులకు నచ్చజెప్పి యార్డ్‌లోకి తీసుకెళ్లారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించకుండా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్‌తో మాట్లాడి కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. కార్యక్రమంలో పత్యానాయక్, రమేశ్‌నాయక్, వెంకటేశ్, శివకుమార్, గణేశ్,శివ, యాదయ్య, గణేశ్‌నాయక్, రాజు, ధర్మ, సోమ్లా, వస్య బుజ్జి, శారద, సిరోలి, మారోని, యాదమ్మ, జంగయ్య, రాములు, తానయ్య, నరేశ్, రమేశ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాల్ పంచాయతీ అధికారులు



రంగారెడ్డి అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): యాచారం మండలం మాల్ పంచాయతీకి జాతీయ పంచాయతీ అవార్డు రావడంతో అధికారులు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను శనివారం కలెక్టరేట్‌లో కలిశారు. మొక్కను బహూకరించి జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్‌తో పాటు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

దుద్యాల మండల వాసికి అవార్డు



అవార్డును అందుకుంటున్న ఉషశ్రీ,శ్యామ్

దుద్యాల, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన ఉషశ్రీ-శ్యామ్‌రాథోడ్ దంపతులు హైదరాబాద్‌లో రాథోడ్స్ ఐఏఎస్ అకాడమీని నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 30న ఢిల్లీలో ఆసియా టుడే నిర్వహించిన వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో ఇన్‌స్టిట్యూట్ ఇన్ హైదరాబాద్ అవార్డును దంపతులు కేంద్ర మంత్రి రాజ్‌భూషన్‌చౌదరి, ఢిల్లీ డిప్యుటీ స్పీకర్ మోహన్‌సింగ్‌బిస్త్‌ల నుంచి అందుకున్నారు. కృషి, అంకితభావం, విద్యారంగంలో చేసిన సేవలకు గౌరవం దక్కిందని శ్యామ్ సోదరులు సీతారాంనాయక్, అంతునాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారిని అభినందించారు.

నగా దారిలో..

5వ పేజీ తరువాయి..

ఆంగ్ల పాఠాలు బోధిస్తున్నారు. అయినా తెలుగు భాష అంటే ఆయనకు ప్రత్యేక అభిమానం. తెలుగులో ఇప్పటి వరకు వందలాది కవితలు రాశారు. పద్యాలు, గజల్స్ కూడా రచించారు. దిన, వార, మాస పత్రికల్లో ప్రచురితమై రాష్ట్రస్థాయి కవితా సంకలనాల్లు చోటు సంపాదించి ప్రముఖ కవులు, సాహితీవేత్తల ప్రశంసలు అందుకున్నారు. పద్యమే తెలుగు భాషకు ప్రాణమని నమ్మిన నరేందర్‌రెడ్డి చందస్సు నేర్చుకుని పద్య రచన చేశారు. ఇప్పటి వరకు శ్రీ అయ్యప్పస్వామి శతకం, అమృత వర్షిణి శతకం,శ్రీ లక్ష్మీనరసింహస్వామి శతకం, గీతామృత శతకం, వేంకటేశ్వరశతకం, వేంకటేశ్వర గజల్స్ రచించి ముద్రించారు. సాహిత్యంలో క్లిష్టమైన ప్రక్రియగా నిలిచిన గజల్‌ను ఇష్టమైన ప్రక్రియగా స్వీకరించి ఉన్నత స్థానానికి ఎదిగిన ఈ కవి ఎందరో అభిమానాలను సంపాదించుకున్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో తనప్రతిభను చాటుకున్నారు.

సినిమా రంగంలో సత్తా చాటి

ప్రముఖ గజల్ గాయని డాక్టర్ స్వరూపరెడ్డి ద్వారా నరేందర్‌రెడ్డి సినిమా ఇండస్ట్రీకి పరిచమ య్యారు. విరాటపర్వం సినిమా దర్శకులు వేణు ఊడుగుల, సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలితో పరిచయం ఉండట ంతో వారు నరేందర్‌రెడ్డికి పా టలు, గజల్స్ రాసే అవకాశం ఇచ్చారు. ఆయన తనకు వచ్చి న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విరాటపర్వం సినిమాకు మూడు పా టలు రాశారు. అదే సినిమాలో ఒక గజల్, రెం డు పద్యాలు కూడా రాశారు. ఈ సినిమాలోని నగదారిలో పాట ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇండస్ట్రీ అంతా ఎవరా నరేందర్‌రెడ్డి అని ఆయ న గురించి ఆరా తీసిన సందర్భాలున్నాయి.

హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు

చిత్ర పరిశ్రమకు పరిచయమై తన పేరును సుస్థిరం చేసుకున్న ద్యావరి నరేందర్‌రెడ్డిని పెద్దేముల్ మండల ప్రజలు అభినందిస్తున్నారు. ఇంకా చాలా సినిమాల్లో పాటలు రాసి తనకు, మండలానికి మంచి పేరును తీసుకురావాలని కోరుతున్నారు. విరాటపర్వం సినిమాలోని నగా దారిలో అనే పాట మహా అద్భుతమని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ కొనియాడారు. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల వారు మంబాపూర్‌లో నరేందర్‌రెడ్డిని సన్మానించారు. సినిమా రంగంలోనూ తాండూరు ప్రాంతానికి మంచిపేరును సంపాదించారని స్థానికులు కొనియాడుతున్నారు. భవిషత్తులో మరిన్ని పాటలు, కవితలు రాయాలని కోరారు.

ఎండిన చెరువుల లీజ్‌లు రద్దు చేయాలి



తాండూరులో మత్స్యకారుల సమావేశంలో పాల్గొన్న నరసింహ

తాండూరు, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండిన చెరువులు, కుంటల లీజ్‌లు రద్దుచేయాలని టీఎంకేఎంకేఎస్ అధ్యక్షులు గొర్రెంకల నరసింహ డిమాండ్ చేశారు. శనివారం తాండూరులోని పీపుల్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నియోజకవర్గ మత్స్య కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారులను పట్టించుకోకుంటే కాంగ్రెస్ పార్టీకి ముదిరాజ్‌లు దూరమవుతారని హెచ్చరించారు. గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు చెరువుల్లో చేప పిల్లలు వదల్లేదని, మత్స్యకారులకు నగదును బ్యాంక్ అకౌంట్లలో జమచేయలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మహాధర్నాను నిర్వహిస్తామని ప్రకటించారు. గీత కార్మికుల మాదిరిగానే 50ఏండ్లు నిండిన మత్స్యకారులకూ పింఛన్ ఇవ్వాలని, చనిపోయిన మత్స్యకారుల కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తీర్మానించారు. అనంతరం తాండూరు గొల్ల చెరువును సందర్శించి శిఖం కబ్జా చేస్తోంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని, అక్రమ నిర్మాణాలు తొలగించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామాల మత్స్య కార్మికులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పల్లకీ సేవ

షాద్‌నగర్ అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట అంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ పల్లకిసేవను నిర్వహించారు. మాజీ సర్పంచ్ పి.శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పల్లకిసేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు జి. వసంత్‌రావు, అన్నారం రాఘగౌడ్, మంచిరేవుల ఆశోక్, గడ్డమీది రమేష్, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకర్ గౌడ్, కిషన్‌నాయక్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ పల్లకీసేవలో భక్తులు

ధాన్యం సేకరణకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శనివారం పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 129 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు సదుపాయాలు కల్పించాలన్నారు. వర్షాలొస్తే వడ్లు తడవకుండా టార్పాలిన్లు, గోనె సంచులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొన్న ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు చేరవేయాలన్నారు. రవాణాకు వాహనాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ మోహన్‌కృష్ణ, మార్కెటింగ్ ఏడీ సారంగపాణి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి, సహకార అధికారి నాగార్జున, డీసీఎంఎస్ అధికారి శ్యామ్ సుందర్‌రెడ్డి, పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

రహదారుణం!



కంకర తేలిన కడ్తాల్ రోడ్డు ◄

5వ పేజీ తరువాయి..

తప్పడం లేదు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 32కిలో మీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్లు దెబ్బతినగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 40 కిలోమీటర్లు దెబ్బతిన్నాయి. హైబ్రిడ్ యాన్యుటిటీ మోడ్(హ్యామ్) పద్ధతిలో రోడ్ల అభివృద్ధికి షాద్‌నగర్ నియోజకవర్గంలో లాల్‌పహాడ్ వరకు 23కిలోమీటర్లు రోడ్డు వెడల్పు, మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 30కిలోమీటర్ల మేర ఏడు రోడ్లకు రూ.6కోట్లు మంజూరు చేశారు. టెండర్ ప్రక్రియలో తీవ్ర కాలయాపన జరుగుతోంది. జిల్లాలో రోడ్ల నిర్మాణాలు, మరమ్మతు పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

అసంపూర్తిగా రోడ్డు పనులు

మీర్‌ఖాన్‌పేట్ నుంచి యాచారం వరకు రూ.78కోట్లతో వేసే రోడ్డు పనులు మూడున్నరేళ్లుగా అసంపూర్తిగా ఉంది. కాంట్రాక్టర్‌కి రూ.20 కోట్ల బిల్లులు రాక పనులు నిలిపివేశారు. కొత్తపల్లి నుంచి కొత్తపల్లి తండా వరకు రూ.3కోట్లతో నిర్మించాల్సిన రోడ్డు అసంపూర్తిగా ఉంది. షాద్‌నగర్-కేశంపేట బైపాస్ రోడ్డు నుంచి ఉప్పలపల్లి వరకు 16కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు మరమ్మతులు చేశారు. కమ్మదనం-షాద్‌నగర్ మధ్యలో కొంత పనులు జరగాల్సి ఉంది. వర్షాలు కురిస్తే అయ్యవారిపల్లి వాగు దాటేందుకు వీలు కావడం లేదు. అక్కడ నిర్మిస్తున్న వంతెన పనులకు బిల్లులు ఇవ్వక పోవడంతో పనులు నిలిచిపోయాయి.

దెబ్బతిన్న రోడ్లు ఇవే..

షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కొందుర్గు-ఉమ్మెంతాల వరకు 6 కిలోమీటర్ల వరకు ఆర్అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నాయి. అలాగే అయ్యవారిపల్లి నుంచి ఆగరాల నుంచి 3కిలోమీటర్లు, లాల్‌పహాడ్ నుంచి చలివేంద్రపల్లి 5 కిలోమీటర్లు, చేగిరెడ్డిఘనాపూర్‌లో నుంచి గాలిగూడ వరకు 6కిలో మీటర్లు, చౌదరిగూడ జీపీ రోడ్డు నుంచి కొంపల్లి రోడ్డు, ఇంద్రనగర్ గుర్రంపల్లి 4కిలోమీటర్లు, జాకారం, దేవలతండా 2కిలో మీటర్లు, రేగడి రామచంద్రాపురం నుంచి రేగడి చల్కమర్రి 5కిలోమీటర్లు, తుంపల్లి వరకు రోడ్లు దెబ్బతిన్నాయి. ఉమ్మెంతాల, రేగడి చల్కమర్రి తక్షణం మరమ్మతులు చేయాల్సి ఉంది. షాబాద్ మండలం నాగర్‌గూడ నుంచి శంషాబాద్ వరకు 35కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.220కోట్లతో చేపట్టేందుకు పారిశ్రామికవాడ నిధులతో పనులు ప్రారంభించారు. అయితే పనులు మూడేళ్ల నుంచి సాగుతున్నాయి. చేవెళ్ల నుంచి వెంకటాపూర్ వరకు 12కిలోమీటర్లు, వెంకటాపూర్ నుంచి కనకమామిడి, చిలుకూర్, నక్కపల్లి, చందానగర్, తొల్‌కట్ట, తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

చేవెళ్ల మండలంలో 41 కిలోమీటర్ల దూరం, శంకర్‌పల్లి మండలంలో 38 కిలోమీటర్ల దూరం వరకు పంచాయతీరాజ్ శాఖ రోడ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి అధికారులు ఇటీవలే ప్రతిపాదనలు పంపారు. అలాగే షాబాద్ మండలంలోని అంతారం నుంచి అప్పారెడ్డిగూడ వరకు 8కిలో మీటర్ల రోడ్డు గుంతలమయంగా మారింది. నాగర్‌గూడ-రేగడిదోస్వాడ 6 కిలోమీటర్ల రోడ్డు గుంతలమయమైంది. దీనికి అదనంగా మరో 25 కిలోమీటర్ల రోడ్లు బాగుచేయాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. మొయినాబాద్ మండలంలో 28కిలోమీటర్ల వరకు రోడ్ల మరమ్మతుల కోసం అధికారులు ప్రతిపాదించారు. పంచాయతీరాజ్ రోడ్లకు సంబంధించి ఎఫ్‌డీఆర్ కింద చౌలపల్లి నుంచి ఉడిత్యాల వరకు 4కిలోమీటర్లు, పరిగి రోడ్డు నుంచి రామేశ్వరం వరకు వయా కిషన్‌నగర్ మీదుగా 8కిలోమీటర్లు, షాద్‌నగర్-మొదుళ్లగూడ, బూర్గల-మధురాపూర్ వరకు, ఎన్‌హెచ్ 44నుంచి శంకరయ్యగడ్డ తండా వరకు, పరిగి రోడ్డు నుంచి బాపనిగుట్ట తండా వరకు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా రూ.9.96కోట్లు మంజూరయ్యాయి. ఇంకా రోడ్డు నిర్మాణాలు చేపట్టలేరు. అలాగే మెంటనెన్స్ కింద షాద్‌నగర్ నుంచి ఈదులపలల్లి వరకు మధురాపూర్-శేరిగూడ వరకు, పరిగి రోడ్డు నుంచి పీర్లగూడ వరకు రోడ్డు నిర్మించేందుకు మెంటెనెన్స్ కింద ప్రతిపాదనలు పంపారు.

టెండర్ దశలోనే పనులు

2023 డిసెంబరు నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎంఆర్ఆర్ కింద 51కిలో మీటర్లకు రూ.15.07కోట్లు మంజూరయ్యాయి. ఇవి టెండర్ దశలో ఉన్నాయి. సీఆర్ఆర్ కింద రూ. 30కోట్లు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. షాద్‌నగర్ నుంచి కిషన్‌నగర్ వరకు రోడ్డు విస్తరణకు, కిషన్‌నగర్-అయ్యవారిపల్లి వరకు రోడ్డు విస్తరణ కోసం ప్రతిపాదనలు పంపించారు. లాల్‌పహాడ్ నుంచి చలివేంద్రపల్లి, నుంచి జాకారం, జిల్లేడు వరకు రోడ్డు వరకు కొత్త రోడ్డు పనులు చేపట్టారు. వీరన్నపేట నుంచి గాలిగూడ వరకు పూర్తి చేశారు.

ఇబ్బందికరంగా ప్రయాణం..

వికారాబాద్ జిల్లాలో ఆర్అండ్‌బీ రోడ్లు కొంతకాలంగా నిర్వహణ, మరమ్మతులకు నోచుకోక కొన్ని మార్గాల్లో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. జిల్లా వ్యాప్తంగా 285కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. తక్షణం మరమ్మతులు చేపట్టాల్సిన రోడ్లు 160కిలోమీటర్లు ఉన్నాయి. వానలు, వరదల ప్రభావంతో జిల్లాలో 135కిలోమీటర్ల వరకు దెబ్బతిన్నాయి. 2023, డిసెంబరు నుంచి ఇప్పటి వరకు జిల్లా పరిధిలో రూ.1,854.43కోట్లతో 38పనులు మంజూరయ్యాయి. ఈ పనుల్లో 21పనులు ప్రారంభం కాగా, 17పనులు అగ్రిమెంట్ స్థాయిలో ఉన్నాయి. రోడ్ల నిర్మాణంలో కొడంగల్ నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ నియోజకవర్గంలో రూ.1,100కోట్లతో రోడ్ల పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటిలో కొన్ని పనులు ప్రారంభం కాగా, మరికొన్ని టెండర్ దశలో ఉన్నాయి. ఇవే కాకుండా ఎస్టీ ఎల్‌డీఎఫ్ కింద ఐదు పనులు మంజూరు కాగా, కొడంగల్ పరిధిలో రూ.27.87కోట్లతో మూడు రోడ్లు, తాండూరులో రూ.5కోట్లు, పరిగిలో రూ.6కోట్లతో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నాన్‌ప్లానింగ్ కింద రూ.5.50 కోట్లతో 3పనులు, సీఆర్ఎఫ్ కింద 2 పనులకు రూ.60కోట్లు మంజూరయ్యాయి. హ్యామ్ విధానంలో రోడ్ల అభివృద్ధికి జిల్లా పరిధిలో రూ.9కోట్ల అంచనా వ్యయంతో 45కిలోమీటర్లు గుర్తించారు. రోడ్ల పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఒక్కొక్కరికీ రూ.15నుంచి రూ.20కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో వారు ఆసక్తి చూపడం లేదంటున్నారు.

పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

వికారాబాద్ జిల్లాలో 2886.80 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రోడ్లు ఉన్నాయి. ఇందులో 480 కిలోమీటర్ల పొడవున రోడ్లు దెబ్బతినగా, వాటిలో 325 కిలోమీటర్ల మేర వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితి ఉంది.. కాగా, గత ఏడాది కురిసిన వానలు, వరదల ప్రభావంతో జిల్లాలో 285 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. 75 రోడ్ల మరమ్మతులకు రూ.37.15 కోట్లు మంజూరైనా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. 2023, డిసెంబరు నుంచి ఇప్పటి వరకు జిల్లా పరిధిలో రూ.117.82 కోట్లతో 57 రోడ్ల మరమ్మతులు, విస్తరణ పనులు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) పద్ధతిలో రోడ్ల అభివృద్ధికి జిల్లా పరిధిలో 398.86 కిలో మీటర్ల పరిధిలో 181 పనులు కిలోమీటర్లు గుర్తించారు.




తారు లేచిపోయి గుంతలమయంగా మారిన మేడ్చల్ మండలం పోతారం-అనంతారం రోడ్డు



పూర్తిగా గుంతలుపడిన మోత్కుపల్లి-వికారాబాద్ రోడ్డు

సీఎం సహాయ నిధి పేదలకు వరం



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, మే 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరం వంటిదని, దీనితో ఏంతో మేలు జరుగుతోందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం తుక్కుగూడలోని కాంగ్రెస్‌కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. నిరుపేద కుంబాల వారు అనారోగ్యంతో అప్పుల పాలవుతున్నారని, ఆస్పత్రి ఖర్చులకు సీఎం సహాయనిధి ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓర్వలేని బీఆర్ఎస్, బీజేపీల నాయకులు ప్రభుత్వంపై పసలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జంగయ్య, సత్యం, సమత తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలకు రూ.8.51లక్షల ఫైన్



మైన్స్ ఏడీ సత్యనారాయణ

తాండూరురూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఓగీపూర్‌లో నాపరాతి అక్రమ తవ్వకాలపై మైన్స్ అధికారులు భారీ జరిమానా విధించారు. ఓగీపూర్‌లోని సర్వే నంబర్-45 పట్టా భూమిలో 2021లో అనుమతి లేకుండా ఫిరోజ్ అహ్మద్ అనే వ్యక్తి పట్టా భూమిలో తవ్వకాలు జరిపారు. అప్పట్లో ఆయనపై మైన్స్ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. మైన్స్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయనకు రూ.8,51,200 జరిమానా విధించినట్లు తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ వెల్లడించారు. అక్రమ తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తప్పవని ఏడీ హెచ్చరించారు. అలాగే తాండూరు మైన్స్ పరిధిలోని నవాబుపేట మండలం మేనేపల్లి కలాన్, కొడంగల్ మండలం పెద్దనందిగామ, గోవిందరావుపూర్, పూడూరు మండలం మంచన్‌పల్లి ఖనిజ సైడ్‌ల్‌లో దరఖాస్తులకు చివరి తేదీ ఈ నెల 9వ వరకు పొడిగించామని ఏడీ వెల్లడించారు.

అర్హులందరికీ రుణాలందిస్తాం

యాచారం, మే3(ఆంధ్రజ్యోతి): యువతీ యువకులకు రుణాలందించి ఆదుకుంటామని, స్వయం ఉపాధి పొందేవారందరికీ రాజీవ్ యువవికాసం పథకం కింద ఆర్థిక సాయమందిస్తామని ఎంపీడీవో జినరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్‌లో బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యూనిట్ పెట్టుకుంటేనే రుణ సాయమందుతుందన్నారు.

ఇబ్బందుల్లేకుండా ధాన్యం సేకరణ



- తలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి

తలకొండపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని ఇబ్బందుల్లేకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి మద్దతు ధర కల్పిస్తున్నామని తలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ఫటా ఫట్

ప్రశ్న : పీఏసీఎస్ పరిధిలో ఎంతమంది రైతులకు సభ్యత్వం ఉంది?

జవాబు : తలకొండపల్లి, కడ్తాల మండలాలకు సంబంధించి 39 గ్రామ పంచాయతీలకు చెందిన 9,139 మంది రైతులకు సభ్యత్వం ఉంది.

ప్ర: ఇప్పటి వరకు ఎంతమంది రైతులకు పంట రుణాలిచ్చారు?

జ: 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యవసాయ పంట రుణాల కింద రూ.2.86 కోట్లు కోట్లు అందించాం.

ప్ర: యాసంగి ధాన్యం సేకరణకు ఎక్కడెక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు?

జ: పౌరసరఫరాల శాఖ సహకారంతో తలకొంపడల్లి, పడకల్, వెల్జాల, చుక్కాపూర్, రాంపూర్, గట్టిప్పలపల్లిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం.

ప్ర: వరికి ప్రభుత్వం ఎంత మద్దతు ధర అందిస్తుంది?

జ: ప్రభుత్వం దొడ్డు వడ్లకు క్వింటాల్‌కు.. ఏ-రకం రూ.2,320, బీ-రకం రూ.2,300 మద్దతు ధర కల్పిస్తోంది. సన్న వడ్లకు ప్రభుత్వ ప్రోత్సాహకంగా క్వింటాల్‌కు రూ.500 అందిస్తోంది.

ప్ర : వానాకాలం ఏ మేర పంట రుణాలు ఇవ్వనున్నారు. స్టడీ, గృహ నిర్మాణం వంటి ఇతర రుణాలు ఏమైనా అందిస్తున్నారా ?

జ : 2025-26 సంవత్సరానికి సుమారు రూ.కోటీ 20లక్షలు పంట రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్ణయించాం. పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉన్న రైతుల పిల్లలకు సంబంధించి విదేశీ విద్యకు రూ.20నుంచి రూ.40 లక్షలు అందిస్తున్నాం. అదేవిధంగా ఇళ్ల నిర్మాణానికి గ్రామాలలో రూ.10 లక్షలు, పట్టణాలలో రూ.15 లక్షలు అందిస్తున్నాం.



ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలెక్టర్ నారాయణరెడ్డి

'పది' టాపర్లను అభినందించిన కలెక్టర్

మాడ్గుల, మే3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయి ర్యాంకులను సాధించిన జడ్పీహెచ్ఎస్ ఇర్విన్ విద్యార్థులను కలెక్టర్ నారాయణరెడ్డి కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో సన్మానించి అభినందించారు. మాడ్గుల మండల టాపర్స్ రాజమోని అశ్విని 600 మార్కులకుగాను 565, మారం సౌమ్యశ్రీ 560, సామల రమ్యశ్రీ 559, మరల శ్వేత 554, మహ్మద్ జునైద్ 554, ఆకుతోట స్నేహిత్ 553, ఆకుతోట ప్రోహిత్ 550, కేసమోని వైష్ణవి 545, కేశమోని పావని 541 సాధించారు. మాడ్గుల మండలంలో మొదటి 10 ర్యాంకులు, రంగారెడ్డి జిల్లాలో 15 ర్యాంకులలో నలుగురు ప్రతిభ చూపారని కలెక్టర్ కొనియాడారు. వీరందరికీ బాసర ట్రిపుల్ ఐటీ, రాష్ట్రంలో అత్యుత్తమ కళాశాలల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు సీట్లు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. ఎంఈవో సర్దార్ నాయక్, హెచ్ఎం పర్వతాలు టీచర్లు పాల్గొన్నారు.

'టీయూడబ్ల్యూజే ప్రభుత్వానికో.. పార్టీకో గొంతుక కాదు'

ఎల్బీనగర్, మే 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ప్రభుత్వానికో లేక పార్టీలకో గొంతుకగా నిలవదని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే పరమావధిగా పోరాడుతోందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ స్పష్టం చేశారు. టీయూడబ్ల్యూజే-ఐజేయూ రంగారెడ్డి జిల్లా యూనియన్ మొదటి కార్యవర్గ సమావేశం శనివారం జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీం పాషా అధ్యక్షతన ఎల్బీనగర్‌లోని మార్కెటింగ్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం భవనంలో జరిగింది. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డితో కలిసి విరాహత్‌అలీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడి మృతులకు సంతాప సూచకంగా మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతూ.. వారి సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేస్తున్న ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే అని అన్నారు. అందువల్లే జర్నలిస్టుల విశ్వాసాన్ని చూరగొన్నదన్నారు. అలాగే అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు వస్తుందని విరాహత్‌అలీ చెప్పారు. గతంలో జర్నలిస్టు కానివారికి కూడా అక్రిడిటేషన్ కార్డులు అమ్ముకున్నారని ఇకపై అలా కుదరదన్నారు. జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

శంకర్‌పల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని ఆదర్శనగర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ అధ్యక్షకార్యదర్శులు రాంచందర్, రాములు కోరారు. కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. ఈమేరకు కాలనీలోని డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం మున్సిపల్ కమిషనర్ యోగేష్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాలనీ ఏర్పడి దాదాపుగా 20 ఏళ్లు కావస్తున్నా మౌలిక వసతులు కరువయ్యాయని వాపోయారు. కాలనీ వాసులందరూ డబ్బులు పోగేసుకుని విద్యుత్ స్తంభాలు, రోడ్లపై మట్టిపోయడం, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. రోడ్లు, మురుగు కాలువలు తదితర సౌకర్యాలు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఎమ్మెల్యే యాదయ్య దృష్టికి సైతం సమస్యలను తీసుకెళ్లడం జరిగిందన్నారు. కాలనీవాసులు రవిందర్, మాణిక్యం తదితరులు ఉన్నారు.

30 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తేవాలి

కేశంపేట, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 30 పడకల ఆసుపత్రి భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తాంకర్ శివాజీ డిమాండ్ చేశారు. శనివారం మండల బీజేపీ నాయకులతో కలిసి కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మాణంలో ఉన్న 30 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వైద్యాధికారి డాక్టర్ నిఖితను కలిసి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని కోరారు. మూడు రోజుల క్రితం చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వస్తే ఒక్కరూ కూడా అందుబాటులో లేరని వివరించారు. మూడు గంటల వరకు ఎవరూ ఉండడం లేదన్నారు. ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్, రేడియాలజిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ముగ్గురు స్టాఫ్ నర్సులకు ఒకరే విధులు నిర్వహిస్తున్నారని, సిబ్బంది కొరతతో సేవలు అందిచడంలో సమయాభావం ఏర్పడుతుందని డాక్టర్ నాయకులకు వివరించారు. మాజీ మండలాధ్యక్షుడు రాఘురాములు గౌడ్, నాయకులు ఐలయ్య, యుగంధర్, రమేష్ గౌడ్, వినోద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కేంద్రం విధానాలతో ప్రమాదం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు

కడ్తాల్, మే 3(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలతో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ పౌరుడు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కడ్తాల మండలం మైసిగండిలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్‌లతో కలిసి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని పార్టీ శ్రేణులు, స్థానికులతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. నాయకులు హీరాసింగ్, జవహర్‌లాల్ నాయక్, శేఖర్‌గౌడ్, మోత్యనాయక్, రామకృష్ణ, ఇమ్రాన్ బాబా, రామకృష్ణ, రాజేశ్, తులసీరామ్ నాయక్, బోసు రవి, మల్లేశ్, వెంకటేశ్, శంకర్, కిషన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు : డీపీఎంలు



చింతపట్లలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న డీపీఎంలు విలాస్‌రావు, నరసింహ

రంగారెడ్డి అర్బన్/యాచారం, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం అమ్ముకోవాలని, దళారులకు తక్కువ ధరకు అమ్మవద్దని డీపీఎంలు విలాస్‌రావు, నరసింహ అన్నారు. ఈమేరకు శనివారం యాచారం మండలంలోని నంది వనపర్తి, చింతపట్ల గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను వారు తనిఖీ చేశారు. యంత్రం ద్వారా ధాన్యం తేమశాతం ఎంత వుందనే విషయాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. బయట తక్కువ ధరకే అమ్ముకోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటే.. ధాన్యంకు మద్దతు లభించనున్నట్లు తెలిపారు. కనీస మద్ధతు ధరను పొందాలంటే తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలను పాటించాలని, తేమ శాతం 17 ఉండేలా, వడ్లలో తాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

ఆమనగల్లు : ప్రభుత్వ నిబంధనలను, మార్గదర్శకాలను అనుసరించి పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నట్లు తలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్, ఆమనగల్లు మార్కెట్ డైరెక్టర్ గట్ల కేశవ రెడ్డి తెలిపారు. తాలు, హమాలి చార్జీల పేరుతో 4 కిలోలు తరుగు తీస్తున్నారన్నది అవాస్తవమని స్పష్టం చేశారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పనకే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. తేమశాతం ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. సీఈవో ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్లు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఆమనగల్లు, మే 3(ఆంధ్రజ్యోతి): వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్ అన్నారు. తేమ శాతం వచ్చిన వరి ధాన్యాన్ని కూడా సకాలంలో తూకాలు వేయకపోవడం, టార్పాలిన్ కవర్లు ఇవ్వకపోవడంతో రైతులకు ఎక్కువ నష్టం వాటిల్లిందని ఆరోపించారు. ఆమనగల్లు మార్కెట్ యార్డును శనివారం సాయంత్రం బీజేపీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు ఎర్రవోలు శ్రీను, గోరటి నర్సింహ, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్లలోని క్యాంపు కార్యాలయంలో 42 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 55 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను యాదయ్య అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తూ ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ బి.కృష్ణయ్య, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌చైర్మన్ బి.రాములు, మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, రాంచంద్రయ్యగౌడ్, గోపాల్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, పాండుయాదవ్, సీనియర్ నాయకులు ఎం.కృష్ణారెడ్డి, చేవెళ్ల స్వామి, నరేందర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

షాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి పలు అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు షాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 5నుంచి 19వ తేదీ వరకు పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గేమ్స్, యోగా, డ్రాయింగ్, క్రాఫ్ట్ తదితర వాటిల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

ఆమనగల్లు, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని లక్ష్య సాధనకు పట్టుదల, ఏకాగ్రతతో ముందుకు సాగాలని ప్రముఖ సంఘ సేవకుడు, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాల ఆవరణలో సాయిరాం మెడికల్స్, వందే మాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ, మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరాన్ని శనివారం వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ దార్ల చిత్తరంజన్‌దాస్‌తో కలిసి రాము ప్రారంభించారు. శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకులు చిత్తరంజన్‌దాస్, వివేక విద్యాభారతి పాఠశాల ప్రిన్సిపాల్ మహమూద్, శిబిరం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

జన, కులగణనకు ఆమోదం అభినందనీయం





మనసాన్‌పల్లి, షాద్‌నగర్‌లో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మహేశ్వరం/షాద్‌నగర్ అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల సౌలభ్యం కోసం జనగణనతో పాటు కులగణనకు ప్రధాని మోదీ ఆమోదం తెలపడం అభినందనీయమని బీజేపీ మండలాధ్యక్షుడు తెల్లమల్ల యాదీష్ అన్నారు. శనివారం మండలంలోని మన్‌సాన్‌పల్లి చౌరస్తాలో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు దేశ్యానాయక్, కుమార్, సాయులు, మాదవ్, కరుణాకర్, శేఖర్, రాజవర్ధన్, రూప్‌సింగ్, తదితరులున్నారు. కాగా, కులగణన చేస్తామని హామీ ఇచ్చిన మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. పార్టీ షాద్‌నగర్ పట్టణ శాఖ అధ్యక్షుడు హరిభూషన్ పటేల్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు కాలనీలలో బీజేపీ జెండాను ఆవిష్కరించి, ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేసి, మోదీకి జైకొట్టారు. మల్ల్యలం మురళి, ప్యాట అశోక్, వంశీకృష్ణ, చెట్ల వెంకటేష్, శ్రీనివాసచారి, సుధాకర్, జంబుల నర్సింహ, రాము, శ్రవణ్, శివశంకర్, బాల్‌రెడ్డి, శ్రీరాం రెడ్డి, సందీప్‌యాదవ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : సీఐ



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మహేశ్వరం, మే 3(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధారుడ్యానికి ఎంతో దోహదపడతాయని, గ్రామస్తుల మధ్య ఐకమత్యాన్ని పెంచుతాయని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని కోళ్లపడకల్‌లో కేపీఎల్ క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. నందిగామ నర్సింహ, చంద్రయ్య, రాజేష్, నర్సింహగౌడ్, మల్లేష్, శ్రీనువాస్, ప్రవీణ్, శేఖర్, భాస్కర్, అనంతరెడ్డి, రఘుపతి, బిక్షపతి క్రీడాకారులున్నారు.

విజయ్ దేవరకొండపై చర్యలు తీసుకోవాలి

చౌదరిగూడ, మే 3(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా సినీనటుడు విజయ్ దేవరకొండ చేసిన వ్యాఖ్యలు గిరిజనుల మనో భావాలను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయని గిరిజన నాయకులు అన్నారు. ఈమేరకు శనివారం జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విజయ్ దేవరకొండ వ్యాఖ్యలపై విచారణ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజన నాయకుడు ఆకాశ్ డిమాండ్ చేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డా.అనితారెడ్డి

మహేశ్వరం, మే 3(ఆంధ్రజ్యోతి): ఆరో గ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు అండగా అర్థ్ ఫౌండేషన్ అందుబాటులో ఉంటుందని, మందు కంటే ముం దు జాగ్రత్తలే ప్రధానమని, ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని అర్థ్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గొల్లూరులో అర్థ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. యాదయ్య, హరినాథ్‌గౌడ్, బాల్‌రాజ్, లోకేశ్వర్‌రెడ్డి, చంద్రమోహన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పూర్తికి ఎమ్మెల్యే ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొత్తపల్లి తండాలో రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి నుంచి కొత్తపల్లి తండా వరకు ఆరు నెలలుగా కంకరకే పరిమితమైన రహదారి దుస్థితిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'రహదారి బాగుచేయరేం..' కంకరతో ఇబ్బందులు పడుతున్న గిరిజనులు అంటూ వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈమేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పందించారు. కంకరతో ఉన్న రహదారిని పరిశీలించి నివేదిక అందించాలని, రోడ్డు ఎందుకు పూర్తికావడం లేదని శనివారం ఎంపీడీవోను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఎంపీడీవో తండాకు వెళ్లి రోడ్డును పరిశీలించారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రోడ్డు వేయిస్తున్నట్లు ఎంపీడీవో చెప్పారు. అధికారులతో మాట్లాడి రోడ్డు బాగు చేయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. తండాలో నర్సరీని పరిశీలించారు.

బీజేపీని బలోపేతం చేయాలి

చౌదరిగూడ, మే 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆర్యసమాజ్ భవనంలో శనివారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పంచాయతీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ సుధాకర్‌రావు, మండలాధ్యక్షుడు రాజు, కోనేరు శ్రీనివాసు, కుర్మయ్య, యాదయ్య, రాజు, లింగం, మల్లేష్, శ్రీధర్ తదితరులున్నారు.



కార్యకర్తలతో జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఎలక్ట్రికల్ టెక్నీషియన్ మృతి



కిశోర్(ఫైల్)

నందిగామ, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎలక్ట్రికల్ టెక్నీషియన్ మృతిచెందిన ఘటన శనివారం నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డులో గల డీఎల్ఎఫ్ వెంచర్ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండలం, జింకురాల గ్రామానికి చెందిన కిషోర్(21) ఓ కాంట్రాక్టర్ వద్ద ఎలక్ట్రికల్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో నందిగామ శివారులోని బైపాస్‌రోడ్డులో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

ఆమనగల్లు, మే3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఆమనగల్లు మండలం కోనాపూర్ గేటు సమీపంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సీతారామ్ రెడ్డి కథనం మేరకు.. ఆమనగల్లు పట్టణానికి చెందిన కావటి శ్రీకాంత్ యాదవ్(25) శంషాబాద్‌లోని అమెజాన్ కంపెనీలో పనిచేస్తూ నిత్యం ఇంటికి వచ్చిపోతుంటాడు. ఈ క్రమంలో విధులు ముగించుకొని శుక్రవారం రాత్రి 2గంటల సమయంలో బైక్‌పై వస్తుండగా కోనాపూర్ గేటు సమీపంలో మృతి చెందాడు. అయితే, ఏదైనా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడా? తనంతట తానే బైక్‌పై నుంచి కింద పడి మృతి చెందాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సీతారామ్ రెడ్డి సందర్శించి మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు తిరుపతయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శ్రీకాంత్ యాదవ్ కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి తండ్రి చిన్న జంగయ్య యాదవ్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.



పూజశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సబితాఇంద్రారెడ్డి

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కందుకూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దెబ్బడగూడకు చెందిన మల్లెపల్లి పూజశ్రీ ఇటీవల ఇంటర్(సీఈసీ ఫస్టియర్)లో ఫెయిలైందని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులను మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి పూజశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మృతురాలు పూజశ్రీ తల్లిదండ్రులు జగన్, సబితలను ఓదార్చారు. ఇంటర్‌లో ఫెయిలైతే ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించారు. కాగా, ఆత్మహత్య చేసుకున్న విషయం తల్లిదండ్రులు ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా గోప్యంగా ఉంచారని పూజశ్రీ తల్లిదండ్రులను సబితాఇంద్రారెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ఎస్.సురేందర్‌రెడ్డి, డి.జంగయ్య, మన్నె జయేందర్‌ముదిరాజ్, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఆర్.రాంరెడ్డి, టి.దేవేందర్, పొట్టి ఆనంద్, తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, తదితరులున్నారు.

కాలేజీ భవన నిర్మాణానికి భారీ విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు ఇస్తున్న బంకట్‌లాల్

షాద్‌నగర్ అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి కేసర్ ఇండస్ట్రీస్ అధినేత బంకట్‌లాల్ భాటి రూ.15 లక్షల విరాళం ఇచ్చారు. ఈమేరకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు శనివారం ఆయన చెక్కును అందజేశారు. పేద విద్యార్థుల కోసం తమ వంతు సహకారంగా విరాళం ఇస్తున్నట్లు ప్రకటించిన భాటిని ఎమ్మెల్యే శంకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాండ్ర కాశీనాథ్‌రెడ్డిలు అభినందించారు.

'విపక్షాలవి కుట్ర రాజకీయాలు'

ఆమనగల్లు, మే3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాహసోపేత నిర్ణయాలు జీర్ణించుకోలేక విపక్షాలు కుట్ర, విష ప్రచారాలు సాగిస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రగతిని అడ్డుకునే వారిని ప్రజలు క్షమించరని అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని రైతులవేదికలో శనివారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ లలిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై 49మందికి చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీడీవో మాధురి, కమిషనర్ శంకర్‌నాయక్, ఏఎంసీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, ఆర్ఐ చెన్నకేశవులు ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

యాచారం/కందుకూరు/కేశంపేట, మే 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జారీచేసిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20 నుంచి సార్వత్రిక సమ్మె చేపడుతున్నామని, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు బ్రహ్మయ్య, చందూనాయక్, పి.కృష్ణలు అన్నారు. ఈమేరకు ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. జీవో 51ను, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ ఉద్యోగుల సంఘ మండలాధ్యక్షుడు బోడ కృష్ణ తదితరులున్నారు. కాగా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజవయంతం చేయాలని సీఐటీయూ కందుకూరు మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ కోరారు. ఐకేపీ సిబ్బందితో కలిసి ఏపీఎం కవితకు సమ్మె నోటీసును అందజేశారు. సిబ్బంది, సీఐటీయూ నాయకులు శేఖర్, బాలకృష్ణ తదితరులున్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ కేశంపేట మండల కన్వీనర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి మండల వనరుల భవనంలో సీఆర్పీ రామకృష్ణకు సమ్మె నోటీసు అందించారు.

మండల కురుమ సంఘం అధ్యక్షుడిగా వెంకటేష్



కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు

శంకర్‌పల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కురుమ సంఘం అధ్యక్షుడిగా మోకిల గ్రామానికి చెందిన బండమీది వెంకటేష్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు కిష్టగోని సదానందం సమక్షంలో శనివారం పిల్లిగుండ్లలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. కురుమలు ఐక్యతతో హక్కుల సాధనకోసం పోరాటం చేయాలని సదానందం కోరారు. వెంకటేష్ మాట్లాడుతూ కురుమల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు, మాజీ ఎంపీపీ నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లేష్, బీజేపీ సీనియర్ నాయకులు భయానంద్, మాజీ సర్పంచ్‌లు ఐలయ్య, సత్తయ్య, శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఐలయ్య, షైపాల్, సత్యం, చెన్నయ్య, జంగయ్య, నర్సింల ఉన్నారు.